క్లుప్తంగా

'యువనేస్తం' సేవలు అభినందనీయం

–ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



యువనేస్తం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గిరిజన కాలనీలో ప్రజలకు యువ నేస్తం అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే యువనేస్తం అసోసియేషన్ కార్యక్రమాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన కాలనీలలో విద్యాభివృద్ధి కోసం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని, అలాగే ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు అవసరం ఉన్నచోట రక్తదానం చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్, ఏర్పేడు మండల ఇన్‌చార్జ్ కిషోర్ రెడ్డి, యువ నేస్తం అసోసియేషన్ కార్యదర్శి జస్వంత్, ఉపాధ్యక్షులు హనుమంత్ నాయక్, కోశాధికారి మునెమ్మ, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల కో–ఆర్డినేటర్లు అరుణ, నాగమణి, యువనేస్తం వలంటీర్లు ప్రవంతి, లక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన విద్యాకానుక కిట్లు



స్కూల్ బ్యాగులను పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: విద్యార్థులకు అందజేసే జగనన్న విద్యాకానుక కిట్లలో స్కూల్ బ్యాగులు ఎమ్మార్సీ కార్యాలయానికి మంగళవారం చేరాయి. ఎంఈఓ కే.రవి ఆధ్వర్యంలో ఎంఆర్‌సీలు, సిబ్బంది(జేవీకే మండల్ టీం) బ్యాగుల నాణ్యతను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ, పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులు విద్యాకానుక కిట్లు అందజేసేందుకు చర్యలు తీసుకొన్నామన్నారు. పాఠశాలల్లో రాగిజావ తాగేందుకు విద్యార్థులకు స్టీల్ గ్లాసులు అందుబాటులో ఉంచామన్నారు. మండలంలో 4,870 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. వీటిలో మీడియం సైజ్ 1248, చిన్నవి 664, పెద్ద సైజు బ్యాగులు 2958 ఉన్నాయని చెప్పారు.

'అంటీ కూతురు' పాట చిత్రీకరణ



జబర్దస్త్ కళాకారులు

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తిలోని సదాశివ టవర్స్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జబర్దస్త్ నటుడు పొట్టి మామ 'అంటీ కూతురు' వీడియో సాంగ్ డైరెక్టర్ ప్రజ్వల్ చిత్రీకరించారు. చిత్రీకరణలో నృత్య దర్శకుడు కర్నూలు చరణ్, ఫణీధర్, శ్రీనివాస్, దినేష్, కళాకారులు పొట్టి మామ, ఉష, భాకరాపేట నందిని, వెంకటకృష్ణ (కట్టప్ప), డ్యాన్సర్ పెరిందేశం బొబ్బిలి పాల్గొన్నారు.

సబ్సిడీకి పచ్చిరొట్ట విత్తనాలు

పిచ్చాటూరు: రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నంజీవ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావలసిన రైతులు తమ భూమికి సంబంధించిన 1బి, ఆధార్‌లతో సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి వస్తే 50 శాతం సబ్సిడీతో జనుము 10 కిలోలు రూ.420లకు, జీలగ 10 కిలోలు రూ.395కు ఇస్తారన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పశు వైద్యుడు మృతి



గోపీనాథ్ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీలో మంగళవారం పశు వైద్యుడు గోపీనాథ్(48) మృతి చెందారు. ఆయన శ్రీకాళహస్తి మండలం తొండమనాడులో పశు వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యం కారణంగా కొంతకాలంగా సెలవులో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంటి వద్ద మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకొని బుధవారం మండలంలో సిద్ధిరాజుకండ్రిగ శ్రీ సోమనాథేశ్వరాలయం, నురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలు నిర్వహించనున్నట్లు ఆయన నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల మధ్యలో నందీశ్వరునికి విశేష అభిషేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించనున్నట్లు తెలియజేశారు.

గంగమ్మా..కరుణించమ్మా!



బీపీ అగ్రహారం గంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

తొట్టంబేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారంలోని గంగమ్మకు, నవగ్రహాల గుడి వద్ద ఉన్న గంగమ్మకు, అలాగే పానగల్ సమీపంలో ఉన్న పొన్నాలమ్మకు ఐదవ మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో అంబలి పోసి, పొంగళ్లు పెట్టారు. బీపీ అగ్రహారంలోని అమ్మవారికి పూజారి హరిస్వామి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు చేశారు. అనంతరం బెంగళూరు నుంచి ప్రత్యేక పూలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అలాగే ఏఎం పుత్తూరుకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పొన్నాలమ్మకు పొంగళ్లు పెట్టారు. నవగ్రహాల గుడి వద్ద ఉన్న గంగమ్మను ప్రత్యేకంగా వెండి కవచంతో అలకరించారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. బుధవారం బీపీ అగ్రహారం గంగమ్మ జాతర వేడుకగా నిర్వహించడానికి ఏర్పాటు చేశారు. వార్డుల్లోని వీధులలో విద్యుత్ దీపాలతో అందంగా అలకరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వన్‌టౌన్ పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

గ్రామాల్లో జాతర సందడి

నారాయనవనం: తిరుపతి గంగమ్మ జాతర నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలలో జాతర సందడి నెలకొంది. ఉదయం నుంచి మహిళలు పొంగళ్లు పెట్టి, నూనె దీపాలతో గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. డీకే పాళ్యం, బ్రాహ్మణ తాంగాళ్, కీళగరం, నారాయణవనం, తిరువట్యం, వీకే పాళ్యం, భీమునిచెరువు, కసిమిట్టలో అమ్మవార్ల కటౌట్లను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం గ్రామాలలో ప్రతిష్ఠించిన నడి వీధి గంగమ్మలను మహిళలు అభిషేకాలను నిర్వహించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. నారాయణవనం బస్టాండ్ సమీపంలో, కీళగరం క్రాస్ వద్ద నడి వీధి గంగమ్మలను అధిక సంఖ్యలో దర్శించుకుని అంబలి పోశారు. మధ్యాహ్నం కుంభాలతో నైవేద్యం సమర్పించారు.



ప్రత్యేకాలంకరణలో పొన్నాలమ్మ



అమ్మవారికి రాగి చెట్టు వద్ద భక్తులు సమర్పిస్తున్న నైవేద్యం



నారాయణవనంలో నడి వీధి గంగమ్మకు మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

డెంగీపై అప్రమత్తం



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు

సత్యవేడు: ఆడదోమల వల్ల డెంగీ జ్వరం వ్యాప్తి చెందుతుందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం దాసుకుప్పంలో జాతీయ డెంగీ నియంత్రణ దినోత్సవాన్ని పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది నిర్వహించారు. డెంగీ నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగు కాలువలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఆరు బయట నిద్రించేవారు దోమతెరలు వాడాలని సూచించారు. డెంగీ వల్ల తీవ్రమైన కండరాల నొప్పి, కీళ్లనొప్పులు, వికారం ఉంటుందని, ఫ్లూ జ్వరంతో బాధపడతారని లక్షణాలను వివరించారు. సకాలంలో చికిత్స పొందకపోతే ప్రాణాపాయం వాటిల్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మీరాకుమారి, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఏఎన్ఎం ఝాన్సీ, సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్త చంద్రమ్మ, ఆశా వర్కర్ జమున తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీలు

తొట్టంబేడు(రేణిగుంట): నేషనల్ డెంగీ డే సందర్భంగా మంగళవారం కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, అనూష ఆధ్వర్యంలో ర్యాలీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాప్తికి కారణమయ్యే దోమల గురించి, వాటి ఆవాసాల గురించి, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు తెలియజేశారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఎంపీహెచ్ఈఓ బాషా, పీహెచ్ఎన్ శాంతకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు డాక్టర్ జావిద్ ఆధ్వర్యంలో డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు, హుస్సేన్, మాధవ్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో..

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండల కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిచ్చాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి మాట్లాడారు. రెండు మండలాల్లోని పీ హెచ్‌సీల నుంచి బయలుదేరి బజారు వీధుల మీదుగా ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు దోమతెరలను వాడాలని, డ్రై డే పాటించాలని, ఇళ్లలో వేపాకు పొగ వేయాలని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. వైద్యాధికారులు హమీద్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్ రావు, నాగలాపురం వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని అమందూరు బీసీ కాలనీలో ఏర్పేడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నాగలాపురంలో..



పిచ్చాటూరులో..



తొట్టంబేడు : కాసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో...



తొట్టంబేడు : శ్రీకాళహస్తి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో..



ఏర్పేడు : అమందూరు బీసీ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అంచెలంచెలుగా ముస్లింపాళెం అభివృద్ధి



ముస్లింపాళెంలో సంక్షేమ బుక్‌లెట్లను లబ్ధిదారులకు ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: మండలంలో అధికంగా ముస్లిం మైనారిటీలు నివాసమున్న ముస్లింపాళెం గ్రామ పంచాయతీని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని, ఆ దిశగా తొలుత మురుగునీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను ఆదేశించారు. మంగళవారం ముస్లింపాళెం గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గౌసియానగర్, ముస్లింపాళెం, లక్ష్మీపురంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

గౌసియానగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు నీటి ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సీసీ రోడ్లు వేయాలని కోరారు. కొన్ని వీధుల్లో కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మురుగు కాలువల నిర్మాణానికి సంబంధించిన అంచనాలు సిద్ధం చేసి నిధులు కేటాయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవకిని, ఇబ్బంది ఉన్న చోట కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇళ్లస్థలాలు కోరిన వారికి పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దార్ గౌరిశంకరరావును సూచించారు. ముస్లింపాళెం గౌసియానగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలని సత్యవేడు సీడీపీఓ దేవకుమారిని ఆదేశించారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి దాదాపు రూ. లక్ష నుంచి రూ. 8లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో నాణ్యతా ప్రమాణాలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని తమ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ముస్లింపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. అక్కడ పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి పిండి వంటకాలను రుచి చూసి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, స్థానిక సర్పంచ్ అబ్దుల్ మజీద్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్, డైరెక్టర్ అబ్దుల్, కో–ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సర్పంచులు వీరభద్రం, దుద్ద వేణు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సుందరరాజస్వామి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన సుందర రాజ స్వామివారు మంగళవారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరాభాద్ర సందర్భంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. స్వర్ణాభరణాలతో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజ స్వామి నాలుగు మాడ వీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఐ రామ్మోహన్, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వన్ స్టేషన్.. వన్ ప్రొడక్ట్



తిరుపతి రైల్వే స్టేషన్‌లో కళాకారులు నిర్వహిస్తున్న దుకాణాలు

తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వేస్టేషన్‌లో 2022లో 30 రోజుల పాటు వన్ స్టేషన్..వన్ ప్రొడక్ట్ పేరుతో వివిధ కళాకారులు తయారు చేసిన వస్తువుల విక్రయం నిమిత్తం దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. అయితే అప్పట్లో కేవలం 30 రోజులు మాత్రమే అనుమతి ఇచ్చారు. అద్భుతమైన స్పందన లభించడంతో, పైలెట్ ప్రాజెక్ట్ కింద అన్ని రైల్వే స్టేషన్లకు విస్తరిస్తున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో యథావిధిగా కొనసాగిస్తున్నారు. దీంతో కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గంగమ్మకు ముక్కంటి సారె సమర్పణ



గంగమ్మకు సారెను తీసుకువస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, చైర్మన్ అంజూరు తదితరులు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారంలో బుధవారం గంగమ్మ జాతర నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీవాణి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో గంగమ్మకు సారెను సమర్పించారు. బీపీ అగ్రహారం సమీపంలోని రఘువరసుందర రామమందిరంలో దేవస్థానం వేదపండితులు ఎమ్మెల్యేకు సంప్రదాయబద్ధంగా తలపాగా చుట్టి, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా గంగమ్మ దేవస్థానం కమిటీ సభ్యులకు సారెను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో నిమ్మకాయల మాలలు, పూలమాలలు, పట్టుచీర, టెంకాయలు, పూలు తదితర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, నాయకులు భరత్ రెడ్డి, రత్నం రెడ్డి, అర్కాడ్ శంకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న క్లస్టర్ ఏపీడీ ప్రేమ్‌కుమార్



ఏర్పేడు : పనులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

తొట్టంబేడు (రేణిగుంట): మండలంలోని ముచ్చివోలు పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న చెరువు కట్ట పునరుద్ధరణ పనులను మంగళవారం క్లస్టర్ ఏపీడీ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. కనీసం నాలుగు గంటల పాటు పనిచేస్తే రోజుకు రూ.272 కూలీ తగ్గకుండా పొందవచ్చన్నారు. అలాగేమార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని, పని ప్రదేశంలో నీడ, నీరు, ప్రథమ చికిత్స బాక్స్ ఉండేలా చూడాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. అలాగే కూలీల సంఖ్య టార్గెట్ ప్రకారం తగ్గకుండా చూడాలని, ప్రతి పంచాయతీలో పండ్లతోటల పెంపకం వైపు రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని, ఈ నెలాఖరుతో పండ్ల తోటల పెంపకానికి గడువు ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ క్రిష్ణయ్య, ఈసీ మునిశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: కూలీలకు ఉపాధి హామీ పనులు విరివిగా కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని అముడూరు పంచాయతీలో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వ్యవసాయ పనులు లేవన్నారు. ఏర్పేడు మండలంలో రోజుకు 5 వేల మంది కూలీలు పనులు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటలు పెంచాలని సూచించారు. ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, క్షేత్ర సహాయకురాలు రవిచంద్ర, కూలీలు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



ఎండీపుత్తూరులో నేలకొరిగిన రేకులు



ఎండీపుత్తూరులో కూలిన చెట్టు

- నేలకొరిగిన రేకులు, చెట్లు
- పిల్లలకు గాయాలు

ఏర్పేడు: మండలంలో మంగళవారం సాయంత్రం గాలీవానకు పలు గ్రామాల్లో చెట్లు, రేకులు నేలకొరిగాయి. పలువురు పిల్లలకు గాయాలయ్యాయి. మడిబాక, ఎండీపుత్తూరు తదితర గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. ఎండీపుత్తూరులో రామయ్య ఆచారి ఇంటికి వేసిన రేకులు గాలికి కిందపడడంతో వాటి కింద ఉన్న పిల్లలకు గాయాలయ్యాయి. అలాగే ఎండీపుత్తూరు, మడిబాక, కందాడు గ్రామ పొలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగాయి.

తొట్టంబేడు మండలంలో..

తొట్టంబేడు (రేణిగుంట): తొట్టంబేడు మండలంలోని వాంపల్లె, మన్నవరం తదితర గ్రామాల్లో గాలీవానకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. వెంటనే ట్రాన్స్‌కో అధికారుల స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు.



పొలాల్లో నేల కొంగిన ట్రాన్స్‌ఫార్మర్



తొట్టంబేడు : గాలీవానకు స్తంభంతో సహా పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్